ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన

అవగాహన సదస్సుల్లో పాల్గొన్న నిర్వాహకులు

జగిత్యాల, జూన్ 16 : తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024 హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత, ఉస్మానియా ప్రొఫెసర్ రవీందర్ ఆధ్వర్యంలో ఉన్నత విద్య-జాతీయ, రాష్ట్రస్థాయి అవకాశాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూహెచ్‌లలో ప్రవేశ పరీక్షలు, ఉన్నత విద్యావకాశాలు, ఎంసెట్ ఇంజినీరింగ్ ప్రవేశాలు తదితర అంశాలపై ఫ్రీ ఎడ్యుకేషనల్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్టీయూ కొండగట్టు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి, జగిత్యాల వర్తక సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యాపకుడు ఆడెపు రాజశేఖర్, శ్రీ చైతన్య కళాశాలల అధినేత ముసిపట్ల రాజేందర్, ఎన్ఎస్‌వీ ప్రిన్సిపాల్ నరేశ్, కొక్కుల ప్రభాకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన వారికి ఉజ్వల భవిష్యత్



పెంబట్లలో చుక్క అక్షరను సన్మానిస్తున్న జిల్లా మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు, నాయకులు

సారంగాపూర్, జూన్ 16 : పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జగిత్యాల మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ సూచించారు. ఆదివారం మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన చుక్క రాజేశం-తిరుమల దంపతుల కూతురు చుక్క అక్షర పదో తరగతిలో 10జీపీఏ సాధించడంపై జిల్లా మున్నూరుకాపు ఆధ్వర్యంలో పెంబట్లలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శ్రీరాములు, విజయ్, వెంకటన్న, మధు, సుధాకర్, చిరంజీవి, లక్ష్మీనారాయణ, కోల శ్రీనివాస్, తేలు రాజు, ఆకుల రాజిరెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, వంశీ, తిరుపతి, రవి, శంకర్, సంఘ సభ్యులున్నారు.

విద్యుత్ షాక్‌తో మూడు ఎడ్ల మృతి

సారంగాపూర్, జూన్16 : బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ స్తంభం విరిగి, తీగలు మీద పడడంతో మూడు ఎడ్లు షాక్ గురై మృతి చెందాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న ఎడ్లు మృతి చెందాయని నారపాక సుధాకర్, నారపాక మమత, పూదరి లలిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకున్నారు.

మద్దులపల్లిలో బర్రె..

పెగడపల్లి, జూన్ 16: పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో రైతు శెవల్ల రాజేశం బర్రె విద్యుదాఘాతంతో మృతి చెందింది. శనివారం గ్రామ సమీపంలోని మేత మేస్తున్న బర్రెపై విద్యుత్ వైర్ తెగి పడడంతో షాక్‌తో మృతి చెందింది. బర్రె విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు రాజేశం కోరారు.

ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లూ చేయండి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- జగిత్యాలలో ఏర్పాట్ల పరిశీలన

మైనార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, జూన్ 16 : ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ఎస్ మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, నాయకులు ఆనంద్ రావు, ఖాజా హసీబుద్దీన్, ఇథేమాద్ ఉల్ హక్, ఖాజా సుల్తాన్ ఉద్దీన్ అహ్మద్, అదిల్ పటేల్, ఫరూక్, ఖుస్రో హాజరి, దుమాల రాజ్ కుమార్ తదితరులున్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని నూతనంగా నియమితులైన జిల్లా వైద్యాధికారి డా.సమీయొద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్య పరంగా తన సహాయం అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. సమీయొద్దీన్ వెంట జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జైపాల్ రెడ్డి, మురళి ఉన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలో ఆదివారం 11 వార్డు గాంధీనగర్ మాదిగ యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

రాయికల్, జూన్ 16 : కిష్టంపేట్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం హాజరై పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తిరుపతిగౌడ్, శంకరయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల రూరల్, జూన్ 16 : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన బడుగు దుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా ఫాదర్స్‌డే

జగిత్యాల టౌన్, జూన్ 16 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజ న్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివా రం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పలువురు ఆదర్శ తల్లిదండ్రులను సన్మానించి, మెమెంటోలు అందించారు. సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, తమ బిడ్డలను కని పెంచి వారి భవిష్యత్తు కోసం త్యాగాలు చేసిన కొందరు తండ్రులు నేడు నిరాదరణకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీ హన్మంతరెడ్డి, వీ ప్రకాశ్‌రావు, కే సత్యనారాయణ, గంగం జలజ, భూమాచారి పాల్గొన్నారు.

మేడిపల్లి, జూన్ 16 : భీమారం మండలం వెంకట్రావుపేటలో ఆదివారం జీర్ట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, గ్రామస్తులున్నారు.

బండలింగాపూర్‌లో పెద్దమ్మ బోనాలు

బోనాలతో వస్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, జూన్ 16: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ముదిరాజ్ సంఘ పెద్దమనుషులు తిగుర్ల స్వామి, పల్లికొండ వినోద్, బొజ్జ రాజం, అంజయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాలను దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ

వెల్గటూర్, జూన్ 16 :వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల కోటేశ్వర స్వామిని జిల్లా అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అడిషనల్ ఎస్పీకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమాసాగర్, అర్చకులు సంజీవ్‌శర్మ, నాగరాజు శర్మ, అన్వేశ్ ఉన్నారు.

వాసవీ క్లబ్ సామాజిక సేవలు

కోరుట్ల, జూన్ 16: పట్టణంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయిలాపూర్ దర్వాజ వద్ద మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులకు గొడుగులు, పేద విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, ట్రాఫిక్ పోలీసులకు మాస్కులను పంపిణీ చేశారు. వాసవీ మాత ఆలయంలో పూజా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ రీజినల్ చైర్మన్ జితేందర్, ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, సునీల్, శ్రీకాంత్, మహేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, జూన్ 16: మండలంలోని సిరికొండ, దూలూర్ శివారులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

దాబా నిర్వాహకుడిపై కేసు

మెట్‌పల్లి రూరల్, జూన్ 16: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట శివారులో అనధికారికంగా నిర్వహిస్తున్న దాబాపై మెట్‌పల్లి ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆర్లెళ్ల చిన్నరాజాగౌడ్ దాబాలో రూ.5వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాథోడ్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణ్‌కుమార్ హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ వహీద్, కానిస్టేబుల్ రామ్‌చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టువస్త్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు

మారుతీనగర్, జూన్ 16 : మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకన్న కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని చేపట్టగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహాజన్ నర్సింలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, శ్రీమన్నారాయన భక్తులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం



దేవాలయ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

ఇబ్రహీంపట్నం,జూన్ 16 : మండలంలోని వేములకుర్తిలో ఆదివారం నూతన దేవాలయ కమిటీ ఏర్పాటు జరిగింది. 16 కుల సంఘాల పెద్దమనుషుల కమిటీ ఏర్పాటు చేసుకొని ఆలయ కమిటీ చైర్మన్‌గా బర్మ మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కోటగిరి శ్రీనివాస్, కోశాధికారిగా గుడ్ల శ్రీధర్, రైటర్‌గా కత్రోజి సాయికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రాధారపు దేవదాస్, ఆరె వినయ్, తోపారపు ప్రభాకర్, రౌతు నర్సయ్య, సున్న భూమన్న, దొనికెన గంగన్న దాసరి రాజు, రాసమల్ల లక్ష్మీరాజం, పాతర్ల రెడ్డి, సుంకిసాల ధర్మగౌడ్, మగ్గిడి గంగారాం, బూక్యా దత్తాద్రి, బండమీద బుచ్చన్నలున్నారు.

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమిద్దాం

మాట్లాడుతున్న జగిత్యాల టీజీవో అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్

జగిత్యాల, జూన్ 16 : సీపీఎస్ రద్దు కోసం అందరూ ఉద్యమించాలని జగిత్యాల టీజీవో అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జగిత్యాల జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ, అన్ని శాఖల్లో సాధారణ బదిలీలు/ఎన్నికల బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని, పెండింగ్, డీఏలు వెంటనే విడుదల చేయడం, సీపీఎస్ రద్దు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీవో కార్యవర్గం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

కోరుట్ల, జూన్ 16: పట్టణంలోని దుర్గా ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాలెపు రామశర్మ వైదిక నిర్వహణలో ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీహోమం జరిపించారు. కార్యక్రమంలో వాసం శివప్రసాద్, రణధీర్, రాజేశ్, శ్రీలక్ష్మీ, రమేశ్, శ్రీనివాస్, మురళి, లక్ష్మీపతి, సాయి పాల్గొన్నారు.

రీవెరిఫికేషన్‌లో జగిత్యాల విద్యార్థికి 10 జీపీఏ

జగిత్యాల, జూన్ : ఎస్సెస్సీ పరీక్ష పేపర్ రీ వెరిఫికేషన్‌లో జగిత్యాల విద్యార్థి 10 జీపీఏ సాధించాడు. జగిత్యాలలోని సూర్య గ్లోబల్ స్కూల్ విద్యార్థి నవ్వ రాజ్‌కుమార్‌కు ఎస్సెస్సీ ఫలితాల్లో సైన్స్ సబ్జెక్టులో 9 జీపీఏ రాగా ఆ విద్యార్థికి ఓవరాల్‌గా 9.8 జీపీయే వచ్చింది. అయితే విద్యార్థి రీ వెరిఫికేషన్ చేయించాడు. విద్యార్థి 10 జీపీఏ సాధించినట్లుగా మార్కుల మెమోను ఎస్సెస్సీ బోర్డు జారీ చేసింది. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ బోయినిపెల్లి శ్రీధర్ రావు, డైరెక్టర్లు హరిచరణ్ రావు, మౌనికరావు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

డాక్యుమెంట్ పోయినది

★నాయొక్క భూమికి సంబంధించిన డాక్యుమెంట్ (సేల్ డీడ్) నెం॥ 4307/97, మంకమ్మతోట, నుండి కోర్టు చౌరస్తా వెళ్ళే దారిలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబర్‌కు తెలుపగలరు. వి.సుజాత సెల్: 9618624624
NTK-319927

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

పెగడపల్లి, జూన్ 16: మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథపై నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతోంది. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ ఆదివారం పలు గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో సుమారు 12 వేల వరకు నివాస గృహాలు ఉండగా, నల్లా కనెక్షన్ ఉన్న నివాసాలు, కనెక్షన్ లేని, వాటితోపాటు, నల్లా కనెక్షన్లు ఉండి నీళ్లు రాని వాటిపై సర్వే చేపడుతున్నట్లు వివరించారు.

అంజన్న సేవలో మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ

మల్యాల, జూన్ 16 : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హెల్త్ అండ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఇక్కడ ఆలయ పర్యవేక్షకుడు సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఉన్నారు.

ఉత్తమ తైక్వాండో కోచ్‌గా ఎంపిక

కోరుట్ల : పురస్కారాన్ని అందుకుంటున్న రమేశ్

కోరుట్ల, జూన్ 16: పట్టణానికి చెందిన నావనంది రమేశ్ ఉత్తమ సీనియర్ తైక్వాండో కోచ్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో ఆదివారం జరిగిన కోచ్‌ల అభినందన సభలో 2024వ సంవత్సరానికి ఉత్తమ సీనియర్ కోచ్ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కురువ శ్రీహరి, ప్రెసిడెంట్ ముఠా శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నాడు. పురస్కార గ్రహీతను పలువురు అభినందించాడు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ సంతోష్ కుమార్, కరీంనగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాజేందర్, కోచ్ సోయబ్, తదితరులు పాల్గొన్నారు.

కాపర్‌వైర్ల దొంగతనంపై పోలీసుల ఆరా

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ వరదకాలువకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్ల కాపర్ వైర్ల దొంగతనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్ పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల శివారులో వరదకాలువ వెంబడి ఆదివారం పరిశీలించారు. బాధి త రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల వ్యవధిలో సుమారు 30 విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

జగిత్యాల/కోరుట్ల/పెగడపల్లి/సారంగాపూర్, జూన్ 16 : విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒకటి గంట వరకు జిల్లాలోని ఆఫీసుల్లో విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్ 16: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన చందనగిరి శ్రీనివాస్ (42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, శ్రీనివాస్ కొన్నేండ్లుగా ఆర్థిక సమస్యలతో బాధపడుతూ తీవ్రంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది వేకువజామున ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డుకు చీర సాయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్నూరుకాపుల అభ్యున్నతికి కృషి చేయాలి

- మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్
- మల్లాపూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



మల్లాపూర్‌లో నూతనంగా ఎన్నికైన మండలాధ్యక్షుడికి నియమాక పత్రాన్ని అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్

మల్లాపూర్, జూన్ 16: గ్రామాల్లో మున్నూరుకాపుల అభ్యున్నతికి సంఘాల నాయకులు కృషి చేయాలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మండల స్థాయి మున్నూరుకాపు సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై, మాట్లాడారు. గ్రామాల్లో మున్నూరుకాపు సంఘాల బలోపేతానికి నూతనంగా ఏర్పడిన కార్యవర్గం కృషి చేయాలని తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతిని కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మల్లాపూర్ మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ముత్యాల శంకర్, ప్రధాన కార్యదర్శులుగా గజ్జి శ్రీనివాస్, సరికెల మహిపాల్, ఉపాధ్యక్షుడిగా నీరటి రాజేందర్, కోశాధికారిగా ఇప్ప గంగారెడ్డి, కార్యదర్శిగా సూది దేవేందర్, సహాయ కార్యదర్శులుగా కొక్కు తిరుపతి, ఆకుల సతీశ్, సలహాదారుడిగా కొప్పుల లక్ష్మీనర్సయ్య, విద్యాకమిటీ మండలాధ్యక్షుడిగా బొక్కల నాగరాజు, క్రీడ విభాగం అధ్యక్షుడిగా ముత్యాల రమేశ్‌తోపాటు, పలువురు కార్యవర్గసభ్యులను ప్రకటించారు. ఇక్కడ మాజీ మండలాధ్యక్షుడు మార్గం నరేశ్, నాయకులు ముత్యాల చంద్రశేఖర్, శ్రీనివాస్, తోట నారాయణ, పుప్పాల మహేశ్, లైశెట్టి శంకర్, తోట మోహన్, పల్లికొండ నారాయణ, కాసరం భూమారెడ్డి, కోట రమేశ్, ప్రవీణ్, సభ్యులున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

సారంగాపూర్, జూన్16 : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి భీమ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు మహిపాల్, మల్లిక్ తేజ, రాజేందర్, ప్రవీణ్, సురేష్ నాయక్, అశోక్, రమేశ్, పోచయ్య, రాజ్‌కుమార్, రాజేశ్వరి, రమ్య, గ్రామస్తులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

మారుతీనగర్, జూన్ 16 : మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1993-94 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. గురువులను శాలువాలతో సన్మానించారు. ఇక్కడ గంధ్ర ఆనంద్‌రావు, ఎల్మీ అశోక్, వెంకటేశ్వర్లు, రాములు, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, జూన్ 16 : మల్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన 1986-87వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండలంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థులంతా కలుసుకుని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. గురువులను సన్మానించారు. అందరూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పుట్ట పాక లక్ష్మణ్, బొట్ల ప్రసాద్, బోడ గోవర్ధన్, మంద శ్రీనివాస్, మంద రవి, బద్దం రవీందర్‌రెడ్డి, ముదాం శ్రీనివాస్, ఎల్లాల సత్యనారాయణరెడ్డి, జనగాం శేఖర్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, జూన్ 16 : మండలంలోని చింతకుంట జడ్పీ హైస్కూల్‌లో 2006-07లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులు కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు. ఆనందోత్సవాల మధ్య గడిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు అంబటి శంకర్, ఉశకోల విశ్వనాథం, రాజలింగం, రామకృష్ణ ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్, జూన్ 16: మండలంలోని వేంపేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. 2006-07 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఒకేచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు.

మారుతీనగర్ : మెట్‌పల్లి ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

మల్యాల : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు